
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

ఆదివారం 7 జనవరి 2024



జంపింగ్‌కు స్కెచ్?



- ఓ మాజీ ఎమ్మెల్యే ఇంట్లో ముఖ్యనేతల రహస్య భేటి
- కాంగ్రెస్‌లో చేరేందుకు నేతల సన్నాహాలు
- 'కొండా' సారథ్యంలో సీఎం సమక్షంలో మారేందుకు యత్నం
- వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మారుతున్న రాజకీయాలు

వరంగల్‌టౌన్, జనవరి 6: వరంగల్ తూర్పు నియోజకవర్గం రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి కేవలం నెలరోజులు దాటింది. అప్పుడే పరిస్థితులు మారుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం వరంగల్‌లో ఓ మాజీ ఎమ్మెల్యే నివాసంలో అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారంతా మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. గతంలో టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలలో పలు నామినేటెడ్, ముఖ్య పదవులు పొందిన మాజీలు సుమారు 30మంది వరకు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. వీరిలో ముగ్గురు మాజీ చైర్మన్లు, ఇద్దరు మాజీ కార్పొరేటర్లు, ఒక ప్రస్తుత కార్పొరేటర్, గతంలో కాంగ్రెస్ తూర్పులో ముఖ్య నాయకుడిగా పనిచేసిన వ్యక్తితోపాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సమావేశమై కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆయనతో కండువా కప్పించుకునేందుకు సమాయత్తమైనట్లు ప్రచారం సాగుతోంది. ఇదే విషయాన్ని కొండా దంపతుల దృష్టికి తీసుకెళ్లగా, సీఎం ఇచ్చిన సమయాన్ని బట్టి చేరికల కార్యక్రమాన్ని పెట్టుకుందామని కొండా దంపతులు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఆ మాజీ ఎమ్మెల్యే ఆదివారం కూడా మరికొంత మంది ముఖ్య నాయకులతో సమావేశం కానున్నట్లు సమాచారం.

ఇంతలో ఎంత మార్పు...

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి కేవలం నెల రోజుల దాటింది. కాంగ్రెస్‌లో చేరేందుకు వెనకడుగు వేసిన నేతలు ఇప్పుడు ఆ పార్టీ కండువా కప్పుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో అప్పటి ఎమ్మెల్యేతో అంతర్గతంగా ఇబ్బందులున్న వారు, అతడితే ఇముడలేకపోయిన వారు బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం చెప్పిందని, ముఖ్య నేతలు హామీ ఇచ్చారని, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని చాలామంది కాంగ్రెస్‌లో చేరేందుకు ఉత్సాహం చూపించలేదు. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తూర్పులో కాంగ్రెస్‌లోకి జంప్ చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు పోటీపడుతున్నారు.

కొద్ది మంది మాత్రం ఏదైతే అది కానీ అంటూ ధైర్యం చేసి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ గెలుపు కోరుతూ ప్రచారం చేశారు. కొద్ది మంది మాత్రం మీకు మద్దతిస్తాం కానీ బయటకు వచ్చి ప్రచారం చేయమని లోలోపల కాంగ్రెస్‌తో ములాఖత్ అయ్యారు. ఎట్టకేలకు కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖను గెలిపించుకున్నారు. సురేఖ ఇప్పుడు మంత్రి అవడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు చాలామంది ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అంచనాలు తలకిందులు..

ఎన్నికలకు ముందు రోజు.. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు అంటూ వార్తలు కనిపించేవి. వృత్తి, ఉద్యోగ, కార్మిక సంఘాలు, కాలనీలు, దుకాణాల సంఘాలు, అపార్టుమెంట్‌ల వాసులు బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపిస్తామని కలిసి ఏకగ్రీవ తీర్మానాలు చేసి వంద రూపాయల స్టాంప్ పేపర్లపై రాసి సంతకాలు చేసి రోజు ఎమ్మెల్యేను కలిసి పత్రాలను అంద జేశారు. తూర్పులో కాంగ్రెస్ అనేదేలేదనే అభిప్రాయంతో డాంభికాలు పలికారు. తూర్పులో కాంగ్రెస్‌కు డిపాజిట్ గల్లంతేనని, మూడో స్థానం కోసం పోరాటం చేయాల్సిందే అంటూ ఎద్దేవా చేశారు. తీరా ఫలితాలు వెలువడ్డాక వారి అంచనాలు తలకిందులయ్యాయి.



రారండోయ్.. ముగ్గులు వేద్దాం..

- నేడు ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు
- ముస్తాబైన వరంగల్ నగరంలోని ఏవీవీ కళాశాల గ్రౌండ్
- ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పోటీలు
- అనంతరం విజేతలకు బహుమతుల పంపిణీ

వరంగల్ కలెక్టరేట్, జనవరి 6: ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూర్ రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుఖేతన ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం వరంగల్ నగరంలోని ఏవీవీ కళాశాల గ్రౌండ్‌లో జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పోటీలు కొనసాగనున్నాయి. విజేతలను న్యాయ నిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ ముగ్గులను ఎంపిక చేస్తారు. విజేతలకు నగదు ప్రోత్సాహం బహుమతులతోపాటు ఆంధ్రజ్యోతి బహుమతి కూడా అందజేయడం జరుగుతుంది. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 8.30 గంటల వరకు ఏవీవీ కళాశాల రాంలక్ష్మణ్ థియేటర్ ఎదురుగా గల గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలకు రావాల్సి ఉంటుంది. ఈమేరకు గ్రౌండ్‌ను ముస్తాబుచేశారు.

ముగ్గుల పోటీల్లో పాల్గొనే వారు నిబంధనలు..

ముగ్గుల పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గులు వేయడానికి అవసరమయ్యే రంగులు, పూల ఇతర సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కలు ముగ్గులు మాత్రమే వేయాలి. ముగ్గు వేసిన అనంతరం ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు వేశారనేది చెప్పాలి. ముగ్గులు వేయడానికి గ్రౌండ్‌లో సర్కిల్ ఏర్పాటు చేయబడింది. అందులో ఒక్కరు మాత్రమే ముగ్గు వేయాలి. ముగ్గు వేయడానికి రెండు గంటల సమయం ఇవ్వబడి ంది. ముగ్గును చేతి వేళ్లతోనే వేయాలి. ముగ్గుల్లో గొబ్బెమ్మలను, బతుకమ్మలను అమర్చవచ్చు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు..

ముగ్గుల పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ. 6 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 3వేలు నగదు బహుమతి అందజేయబడును. పోటీల్లో పాల్గొనే ప్రతీ ఒక్కరికి బహుమతి ఇవ్వబడుతుంది.

సమయం..

ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ముగ్గులు వేయడం. మధ్యాహ్నం 12 గంటల వరకు న్యాయ నిర్ణేతలచే బహుమతులదారుల ఎంపిక. మధ్యాహ్నం 12.30 గంటలకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుంది.

బీఆర్ఎస్ కార్పొరేటర్‌పై అట్రాసిటీ కేసు

- కాంగ్రెస్ మహిళా కార్యకర్తపై దూషణలు
- 13వ డివిజన్ కార్పొరేటర్‌పై కేసు

వరంగల్ సిటీ, జనవరి 6: గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ 13వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ సురేష్ జోషిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. దేశాయిపేట ఎంహెచ్ నగర్‌కు చెందిన కుమ్మరి పూర్ణ ఫిర్యాదు మేరకు సురేష్‌జోషిపై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.

మూడు నెలలుగా ఎంహెచ్‌నగర్‌లో అద్దెకు ఉంటున్న పూర్ణ కాంగ్రెస్ కార్యకర్త. కాగా, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమందిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్పించిందన్న కోపంతో కార్పొరేటర్ పూర్ణపై కక్ష పెంచుకున్నాడు. అలాగే, ఆమె అద్దెకుంటున్న ఇల్లును ఖాళీ చేయించేందుకు యత్నించాడు. ఇదిలా ఉండగా, ఈనెల 4న సాయంత్రం దేశాయిపేట చెరువుకట్టపై పూర్ణ నడుస్తూ వెళ్తుండగా, అక్కడకు వచ్చిన కార్పొరేటర్ సురేష్ జోషి ఆమెను కులం పేరుతో దూషి స్తూ, దుర్భాషలాడాడు. దీంతో పూర్ణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేసి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. గతంలోనూ కార్పొరేటర్ తనపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

- వివిధ శాఖల అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష సమావేశం

వరంగల్ కలెక్టరేట్, జనవరి 6: నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం సాయంత్రం హనుమకొండలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో జిల్లాకు చెందిన వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి తగు సూచనలు చేశారు. నగర అభివృద్ధికి ఇప్పటి వరకు స్మార్ట్ సిటీ, సీఎం హామీ నిధులు, జనరల్ ఫండ్ కింద చేపట్టిన అభివృద్ధి పనులు ఏఏ దశల్లో ఉన్నాయని పూర్తయిన పనులు పురోగతిలో ఉన్న పనులు చేపట్టాల్సిన పనులు తదితర అంశాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి మున్సిపాలిటీ, కుడా, ఆర్ అండ్ బీ, విద్యుత్, డీఆర్‌డీఏ, అటవీ, ఇరిగేషన్ విభాగాల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇప్పటి వరకు ఎన్ని పనులు పూర్తి చేశారు. ఇతర అంశాలపై మంత్రి సమీక్షించారు. నగరానికి మంచి ఫేస్ లిఫ్ట్ ఇవ్వడానికి కుడా ద్వారా చేపట్టాల్సిన పనులైన వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి ఆలయం మాడా వీధులు,



అధికారులతో ఆర్ అండ్ బీ అతిథి గృహంలోమాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఇన్నర్ రింగ్ రోడ్డు పనులను యుద్ధ ప్రతిపాధికన చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. సమావేశంలో ఆర్‌డీవో వాసుచంద్ర, డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, డీసీపీ ప్రకాష్‌రెడ్డి, ఆర్ అండ్ బీ అధికారి జితేందర్‌రెడ్డి, మున్సిపల్ ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, ఎంహెచ్‌వో రాజేష్, ఈఈ భీంరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా...

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. శనివారం రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పిల్లి సాంబశివరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు స్టేట్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంత్రిని మర్యాదపూర్వంగా కలిసి బొకే అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కొప్పు ప్రసాద్, మంచిక ప్రమోద్‌కుమార్, గులాం యజ్‌దాని, పాకల రాజయ్య, కందకట్ల శరత్ బాబు, గుగులోత్ వీరేందర్, ప్రసాద్, వేణుగోపాల్, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రంగశాయిపేట డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరిస్తా..

శంభునిపేట : రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధికి సహకారం అందిస్తానని మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. వరంగల్‌లోని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం కళాశాల అధ్యాపకులు మంత్రిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళాశాల సమస్యలపై మంత్రితోపాటు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు వినతి పత్రం అందించారు.

ముగిసిన 'ప్రజా పాలన'

- జిల్లా వ్యాప్తంగా 2.88లక్షలకు పైగా దరఖాస్తులు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 6: ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన' కార్యక్రమం శనివారంతో జిల్లా వ్యాప్తంగా ముగిసింది. డిసెంబరు 28న ప్రారంభమై జనవరి 6 వరకు కొనసాగింది. 8 రోజుల పాటు కొనసాగిన ప్రజా పాలన కార్యక్రమంలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో, మునిసిపాలిటీల పరిధిలోని వార్డుల్లో, నగర పరిధిలోని డివిజన్లలో ప్రభుత్వం నిర్ణేశించిన తేదీల్లో కొనసాగింది. జిల్లాలోని మండలాల్లో 12,285 కుటుంబాలకు చెందిన 1,32,228 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే నర్సంపేట మునిసిపల్ పరిధిలో 1,614 కుటుంబ సభ్యులకు సంబంధించి 12,724 దరఖాస్తులు వచ్చాయి. వర్ధన్నపేటకు చెందిన 725 కుటుంబ సభ్యులకు సంబంధించి 3,619 దరఖాస్తులు వచ్చాయి. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ పరిధిలో 17,315 కుటుంబ సభ్యులకు చెందిన 1,16,752 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 30,665 కుటుంబ సభ్యులకు సంబంధించి 2,88,176 దరఖాస్తులు వచ్చాయి. అలాగే నర్సంపేట మునిసిపాలిటీలో 24 వార్డులకు సంబంధించి దరఖాస్తులు 10,843 వర్ధన్నపేట మునిసిపాలిటీలో 12వార్డులకు సంబంధించి 4086 దరఖాస్తులు, వరంగల్ నగర పరిధిలో 32 డివిజన్లలో 1,13,443 దరఖాస్తులు వచ్చాయి.

మండలాల వారీగా దరఖాస్తులు

చెన్నారావుపేట మండలంలో 12,976, దుగ్గొండ మండలంలో 14,789, గీసుగొండ మండలంలో 11,637, ఖానాపూర్ మండలంలో 11,713, నల్లబెల్లి మండలంలో 13,426, నర్సంపేటలో 13,078, నెక్కొండ మండలంలో 18,072, పర్వతగిరి మండలంలో 16,237, రాయపర్తి మండలంలో 17,729, సంగెం మండలంలో 18,115, వర్ధన్నపేటలో 12,032 వచ్చాయి. మొత్తం దరఖాస్తులు 1,59,804.

నెలాఖరుకు జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- క్షేత్ర స్థాయిలో పనుల పరిశీలన

మేడారం, జనవరి 6 : మేడారంలో మహా జాతర నేపథ్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఏర్పాట్లను నెలాఖరులోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నాణ్యత లోపించినా, సకాలంలో పనులు పూర్తికాకున్నా సంబంధిత అధికారులు ఇంటికేనని హెచ్చరించారు. శనివారం తాడ్వాయి మండలంలోని మేడారంలో పర్యటించిన సీతక్క జాతర ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, ఇతర శాఖల అధికారులతో కలిసి పనులను పరిశీలించిన సీతక్క పలు సూచనలు చేశారు. వనదేవతల గద్దెలను దర్శించుకొని మెక్కులు సమర్పించారు. అనంతరం ఐటీడీఏ అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆతర్వాత మీడియాతో మాట్లాడుతూ జాతరలో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసిన రూ.75 కోట్లకు అదనపు నిధులిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో అంగరంగ వైభవంగా జరిపిస్తామన్నారు.



మేడారంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

జాతరకు జాతీయ హోదా కోసం రాష్ట్రపతిని కోరడం జరిగిందని, ఈసారి హోదా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతరను కాలుష్యరహితంగా జరిపించడంలో అధికారులు, భక్తులు సహకరించాలని కోరారు.

మేడారమంతా కలియదిరుగుతూ..

అధికారులతో కలిసి మేడారం పరిసరాల్లో మంత్రి సీతక్క కలియదిరిగారు. ఆదివాసీ మ్యూజియాన్ని సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. మ్యూజియం, హరిత హోటల్ మరమ్మతు పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం రూ.85 లక్షలను మంజూరు చేసిందన్నారు. వీఐపీలు, వీవీఐపీలు వచ్చే రహదారుల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్, టికెట్ కౌంటర్లు,

మిగతా 8వ పేజీలో..

జీడబ్ల్యూఎంసీకి ఓడీఎఫ్++

- నాలుగోసారి నగరానికి దక్కిన ఘనత

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 6: వరంగల్ మహానగరానికి మరోమారు ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ)++ సిటీ గుర్తింపు దక్కింది. నగరానికి ఈ ఘనత దక్కడం ఇది నాలుగోసారి. నాలుగేళ్లుగా నగరం వరుసగా గుర్తింపు పొందుతుండడం ప్రస్తావనార్హం. సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ అఫైర్స్ దేశంలోని ఓడీఎఫ్ నగరాలను ప్రకటించింది.

ఇందులో వరంగల్ నగరం స్థానం దక్కించుకుంది. నగరంలో మెరుగైన పారిశుధ్యం, ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు, పబ్లిక్ టాయిలెట్లు, షీ టాయిలెట్ల నిర్వహణ, మానవ మల వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్లు, సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణతో పాటు ప్రత్యేకంగా మూడేళ్లకోసారి ఇంటి సెప్టిక్‌ట్యాంక్‌ల శుభ్రం అంశంలో నగరానికి ఈ ఘనత దక్కింది. కాగా, నగరానికి నాలుగోసారి ఓడీఎఫ్ ++ గుర్తింపు దక్కడం ఆనందంగా ఉందని మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు.

34కిలోల గంజాయి పట్టివేత

- ఐదుగురిపై కేసు నమోదు
- పట్టుబడిన సొత్తు విలువ రూ.8.4లక్షలు



రైల్వే పోలీసులు పట్టుకున్న ఎండు గంజాయి, నిందితుల అరెస్ట్ చూపుతున్న దృశ్యం

వరంగల్, జనవరి 6 : వరంగల్ రైల్వేస్టేషన్‌లో శనివారం 34 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి జీఆర్‌పీ సీఐ జి.నరేష్ విలేఖరులకు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రైళ్లలో గంజాయి రవాణా నిరోధంలో భాగంగా జీఆర్‌పీ సీఐ జి.నరేష్, ఆర్‌పీఎఫ్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు శనివారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు తనిఖీ చేశారు. తనిఖీలో ప్లాట్‌ఫాం నంబరు 2, 3 పై కాజీపేట వైపు అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురు వ్యక్తులతో పాటుగా వారి వద్ద బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి వాసన వచ్చింది. వెంటనే వారిని జీఆర్‌పీకి తరలించి విచారించగా గంజాయి తరలింపు బయటపడింది. హైదరాబాద్ మహానగరంలోని వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులలో పనిచేస్తున్న ఆనంద్ కుమార్ శర్మ (28), కోళ్ల సందీప్ యాదవ్ (22), శివం వర్మ (19), దండుగ కిశోర్ (19), షిండే అఖిల్ (19)లు విజయనగరంలో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లుగా అంగీకరించారు. అనంతరం పట్టుకున్న 34 కిలోల ఎండు గంజాయితో సహా నిందితులు ఐదుగురిని కాజీపేట రైల్వే కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. ఈ ఎండు గంజాయి విలువ రూ.8.54లక్షల ఉందని తెలిపారు. ఈ గంజాయిని పట్టుకున్న బృందంలో ఆర్‌పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు తదితర సిబ్బంది ఉన్నట్లు సీఐ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

రాష్ట్రంలో రెండు ఎంపీ సీట్లు మాదిగలకు కేటాయించాలి

మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

హనుమకొండ రూరల్, జనవరి 6: రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న మాదిగలకు అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలు కేటాయించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. శనివారం అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైన ఉపేందర్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ.. మాదిగలను మోసం చేసిన బీజేపీ తరుఫున మంద కృష్ణ వరంగల్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తే.. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానని అన్నారు. మాదిగ ఉద్యమాన్ని పట్టించుకోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాదిగ జేఏసీ కృషి చేస్తుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్లను దండుకోవడానికే బీజేపీ తెర లేపిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి ధీరన్, బి.వీరేందర్, వి.శోమచంద్రశేఖర్, ఓ.శంకర్, ఎం.ఆరోగ్యం, సంపత్, ఉపేందర్, మధుకర్, అశోక్, రవి, అనిల్, గోపి, రామ్‌కుమార్, శ్రీనివాస్, కిషన్, మోహన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 6: గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా www.tsbcstudycircle.cgg.-gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంజనీరింగ్ అధికారుల చేరిక అదనపు బలం

ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జగన్మోహన్‌రావు


సభ్యత్వ రశీదును అందచేస్తున్న జగన్మోహన్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 6: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మిళితం కావడం తమకు అదనపు బలాన్ని ఇచ్చిందని టీజీవో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జగన్మోహన్‌రావు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా టీఎస్‌సీపీఎస్‌ఈయూ కన్వీనర్ ఏఈ దొడ్డపాటి హరికుమార్ ఆధ్వర్యంలో టీజీవోలో మిళతం చేసే కార్యక్రమం శనివారం జరిగింది. హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలోని టీజీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన జగన్మోహన్‌రావు మాట్లాడారు. జీడబ్ల్యూఎంసీ ఏఈలు టీజీవో చేరడం అభినందనీయమన్నారు. ఇంజనీరింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఇంజనీరింగ్ అధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రవళి, మిజముల్, సౌజన్య, రాగి శ్రీకాంత్, మేనక, అజ్మీరా శ్రీకాంత్, విజయలక్ష్మి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కిష్టయ్య సస్పెన్షన్

వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సస్పెండ్ ఉత్తర్వులు జారీ



కేయూ క్యాంపస్, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఆడిట్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.కిష్టయ్యను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5న శుక్రవారం కేయూ ఆడిట్ కార్యాలయంలోని ఏఆర్ కిష్టయ్య తన చాంబర్‌లో వర్సిటీ హస్టల్స్‌కు పాలు, పెరుగు సరఫరా చేసే కాంట్రాక్టర్ పి.రాజేందర్ నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కాడు, ఈ నేపథ్యంలో శనివారం కిష్టయ్యను ఏసీబీ కోర్టుకు సంబంధిత పోలీసులు అధికారులు హాజరుపరిచారు. హైదరాబాద్‌లోని ఏసీబీ మేజిస్ట్రేట్ కిష్టయ్యను 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించగా చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ పోలీసుల అరెస్ట్, రిమాండ్, ఏసీబీ డీఎస్పీ సమాచారం ఆధారంగా కిష్టయ్యను శాఖపరమైన చర్యల్లో భాగంగా ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తదుపరి చర్యలు కోర్టు ఉత్తర్వుల మేరకు ఉంటాయని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు స్పష్టంచేశారు.

కేయూ ఏఆర్ కిష్టయ్య ఇంట్లో ఏసీబీ సోదాలు

కేయూలో శుక్రవారం మధ్యాహ్నం ఆడిట్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య ఇంట్లో శనివారం ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. వర్సిటీలో కిష్టయ్య ఆఫీస్‌లోనూ పనిచేస్తున్న తోటి ఉద్యోగుల వివరాలు, ఫోన్‌నెంబర్లను సేకరించారు. కిష్టయ్య ఇంట్లో పెద్ద ఎత్తున బంగారంతో పాటు నగదు, దస్తావేజులు, ఇతర వివరాలను ఏసీబీ పోలీసులు సేకరించారు. కిష్టయ్య అక్రమ ఆస్తులను గుర్తించినట్లు తెలుస్తోంది. కాగా, కిష్టయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బావిలో దూకి యువతి ఆత్మహత్య

మరిపెడ రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 6 : అనుమానాస్పదంగా బానోతు చామంతి (18) అనే యువతి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మూలమర్రి తండాలో చోటు చేసుకుంది. మృతురాలు తండ్రి శ్రీను, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. మూలమర్రి తండాకు చెందిన బానోతు శ్రీను-చిలకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకూతురుకి వివాహమైంది. అనారోగ్యంతో మూడేళ్ల క్రితం చిలకమ్మ మృతి చెందింది. రెండో కుమార్తె చామంతి వాల్యాతండాకు చెందిన వాసు అనే యువకుడితో ప్రేమలో పడింది. గత 20 నెలల క్రితం చామంతి, వాసుకు వాగ్వావాదం జరిగింది. దీంతో ఆమె పురుగుల మందు సేవించింది. ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. చామంతి చికిత్సకు సుమారు రూ.3లక్షల ఖర్చు అయింది. ఆ తర్వాత పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి, వాసుకు రూ.4 లక్షలు జరిమానా విధించారు. అయితే ఈమధ్య కాలంలోనే వాసు, చామంతి ఇద్దరూ కలవడం జరిగింది. ఈ నేపథ్యంలో చామంతి, వాసును పెళ్లి చేసుకోమని అంటే వాసు తాను ఇచ్చిన రూ.4 లక్షలు ఇస్తేనే పెళ్లి చేసుకుంటాను అని అంటున్నాడని వారు తెలిపారు. చామంతి తండ్రి శ్రీనుకు కేవలం 15 గుంటల వ్యవసాయ భూమి మాత్రమే ఉంది. ఈ క్రమంలో ఈనెల 2న మండల కేంద్రంలోని ఓ థియేటర్‌లో సినిమా చూసి, తానంచర్లకు వెళ్లి వాసుకు ఫోన్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటాను అని చెప్పి, మూలమర్రి తండా శివారు రైతు వేదిక వద్ద వ్యవసాయ బావిలో దూకి చామంతి ఆత్మహత్య చేసుకుంది. కాగా, వ్యవసాయ పొలంలో ఉన్న గిరిజనులు శనివారం బావి వద్దకు వెళ్లగా మృతదేహం తేలియాడుతూ కన్పించింది. వెంటనే వారు పోలీసులుకు సమాచారం అందివ్వగా పోలీసులు వెళ్లారు. తండ్రి బానోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహెర్‌బాబా తెలిపారు.



‘ట్రాఫిక్’లో వసూళ్ల దందా

తనిఖీల్లో కొందరు అధికారుల చేతివాటం ● డ్రంకెన్ డ్రైవ్ టార్గెట్ పేరుతో అక్రమ సంపాదన ● కొన్ని చోట్ల ప్రయివేటు వ్యక్తులతో దందా

ట్రాఫిక్ విభాగంలో వసూళ్ల పర్వం పెచ్చుమీరిపోతోంది. తనిఖీల పేరుతో వాహనదారుల జేబులు గుల్ల చేస్తున్నారు. కొందరు అధికారులు సంపాదనే ధ్యేయంగా దిగజారుతున్నారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్ వారికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఎవరైనా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే చాలు.. ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. అలాగే నెలవారీగా ఇసుక వాహనాలు, క్వారీ, రెడ్‌మిక్స్ తదితర వాటి నుంచి వచ్చే మామూళ్లతో లక్షలకు పడగెత్తుతున్నారు. వాహనదారులను పీల్చి పిప్పి చేస్తున్న కొందరు ట్రాఫిక్ పోలీసులపై సీపీ అంబర్‌కిషోర్ ఝా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే యువకుల నుంచి డబ్బులు తీసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ డేవిడ్‌ను సస్పెండ్ చేశారు. దీంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

హనుమకొండ క్రైం, జనవరి 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో కొందరు అధికారుల తీరు పోలీసు శాఖకే మచ్చ తీసుకువస్తోంది. తనిఖీల్లో అక్రమ సంపాదనే ధ్యేయంగా అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తి దొరికితే చాలు.. ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. సాధారణంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని ప్రయివేటు పార్కింగ్ సెంటర్లలో ఉంచుతారు. నిజానికైతే అక్కడ రోజుకు రూ.10 చార్జి చేయాలి. కానీ పార్కింగ్ యజమానులు వాహనదారుడి నుంచి రోజుకు రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేసి ట్రాఫిక్ సిబ్బందికి ప్రతీ నెలా మామూళ్ల రూపంలో అప్పగిస్తారనే ప్రచారం ఉంది. ఇక ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడితే రూ.10వేలు ముట్టజెప్పనిదే వదలరు. ఇలా ఇటీవలకాలంలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు ట్రాఫిక్ పోలీసులకు తాగి పట్టుబడి డబ్బులు ముట్టజెప్పి మరీ తేలు కుట్టిన దొంగలా కిక్కురుమనకుండా మిన్నకుండిపోయారు.

డ్రంకెన్ డ్రైవ్‌లే ఆదాయంగా..

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని ఓ పోలీసు పరిధిలో పని చేస్తున్న అధికారికి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఆదాయమార్గంగా ఏర్పడింది. పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ప్రతీరోజూ టా ర్గెట్‌గా చేయాల్సిన డ్రంకెన్‌డ్రైవ్‌ల పేరుతో అందినకాడికి దండుకుంటున్నాడనే విమర్శలు వస్తున్నాయి. తన సర్వీసు ముగింపునకు దగ్గరగా ఉండడంతో ఇదే అదును గా భావించి నాలుగురాళ్లు వెనకేసుకునే పనిలో పడ్డాడు. ఇలా ప్రతీ రోజూ రూ.10వేలకు తక్కువ కాకుండా పలు సెంటర్‌లలో అడ్డాపెట్టి వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ పేరుతో సంపాదనకు ఎగబడ్డాడు. తన వద్ద ఇద్దరు నమ్మకమైన వ్యక్తులు ఒక ప్రైవేటు డ్రైవర్, ఒక హోంగార్డును వెంటేసుకుని నగర ప్రజలను డబ్బుల కోసం నరకం చూపిస్తున్నాడు.

మందుబాబుల జేబులు గుల్ల

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తులను కోర్టు కానిస్టేబుళ్లతో పాటు సంబంధిత ట్రాఫిక్ పోలీసు అధికారులు అందిన కాడికి దండుకుంటారనే ప్రచారం ఉంది. మందుబాబుల జేబుల ను ఓ కోర్టు కానిస్టేబుల్ గుల్ల చేస్తున్నాడనే విమర్శలున్నా యి. ఇలా లక్షలకు పడగెత్తే కానిస్టేబుల్.. సంబంధిత సీఐ కి నెలకు రూ.1లక్ష లంచం ఇస్తున్నాడంటే ఏమేరకు వసూలు చేస్తున్నారో అర్థమవుతోంది. బాధితులనుంచి రూ.3 వేలకు పైగా వసూలు చేసి సంబంధిత స్టేషన్ అధికారికి పర్సంటేజీ లెక్క ముట్టజెబుతున్నాడు. అయితే పట్టుబడిన వ్యక్తి కోర్టులో చెల్లించాల్సిన డబ్బుల కంటే సదరు కోర్టు కానిస్టేబుల్‌కు చెల్లించే డబ్బే ఎక్కువవుతోందని లబోదిబోమంటున్నారు.

నెలవారి మామూళ్లు

ఇసుక డంపులు, మొరం ట్రాక్టర్లు, ఆటో అడ్డాలు, రెడ్‌మిక్స్ యజమానులనుంచి ఒక్కో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు రూ.5లక్షల వరకు మామూళ్లు వస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతుంటే పోలీసులు ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా సీపీ సార్.. జర ట్రాఫిక్ అధికారులపై దృష్టి సారించి సామాన్యులను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రయివేటు వ్యక్తుల హవా

వారు పోలీసు కానిస్టేబుళ్లు కాదు.. హోంగార్డులు అసలే కాదు.. కానీ ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారి వెనకాల పరుగెత్తి మరీ పట్టుకుంటారు.. వాహన యజమాని అనుమతి లేకుండానే బైక్ తాళం లాక్కుని అధికారి వద్దకు తీసుకెళతారు. వారు అనుకున్న ప్రకారం డబ్బులు ముట్టజెబితే వదిలేస్తారు.. లేదంటే వారే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేసి కోర్టుకు వెళ్లేలా చేస్తారు.. ఇటీవల వరంగల్ పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ప్రయివేటు వ్యక్తుల విచ్చలవిడితనం పెరిగిపోయింది. ఎస్ఐ, ఆర్ఎస్ఐ, సీఐ స్థాయి అధికారుల వద్ద పని చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అధికారులకంటే వీరే ఎక్కువ ఫోజులు కొడుతూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు ట్రాఫిక్ విభాగంలో చేరి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో చాలా చోట్ల ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

ట్రాఫిక్ ఎస్ఐ డేవిడ్‌పై వేటు

యువకుల నుంచి డబ్బులు వసూలు చేయడంతో సస్పెన్షన్



హనుమకొండ క్రైం, జనవరి 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సిలివేరు డేవిడ్‌ను సీపీ అంబర్ కిశోర్ ఝా సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు యువకుల నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోవడంతో విచారణ చేపట్టిన సీపీ.. ఎస్ఐ డేవిడ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే..

ఇటీవల హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలో ఎస్ఐ డేవిడ్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆపాడు. వాహన పత్రాలు లేకపోవడంతో విద్యార్థులను ఎస్ఐ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీ లేక విద్యార్థులు రూ.500 ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ తతంగాన్ని బాధిత యువకుల స్నేహితులు అక్కడే ఉన్న భవనంపై నుంచి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఆపై ఎస్ఐ డేవిడ్ డబ్బులు తీసుకుంటున్న వీడియోను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మరి కొందరు ఎస్ఐ నిర్వాకాన్ని సీపీ అంబర్ కిశోర్ ఝాకు పంపించారు. దీంతో సీపీ నిఘా వర్గాల ద్వారా విచారణ చేయించారు. నిజమని తేలడంతో శనివారం విధుల నుంచి తొలగించారు.

వివాదాస్పదుడు

ఎస్ఐ డేవిడ్‌కు ఆది నుంచి వివాదాస్పదుడిగా పేరుంది. కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ఎస్ఐ ర్యాంకర్‌గా పదోన్నతి పొందిన డేవిడ్.. గతంలో వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో రెండేళ్లు పనిచేశారు. అక్కడి ప్రజలను, సిబ్బందిని డబ్బుల కోసం ఇబ్బంది పెట్టడంతో అప్పటి సీపీ రంగనాథ్ డేవిడ్‌ను కొడకండ్ల పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ సిబ్బందితో గొడవ పడడంతో హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ మూడు మాసాల్లో వాహనదారులను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టినట్టు తెలిసింది. దీంతో కొందరు ఎస్ఐ అక్రమాలకు చెక్ పెట్టేందుకు డబ్బులు తీసుకుంటున్న వీడియోను సీపీకి పంపించడంతో విధుల నుంచి తొలగించారు.

టెక్స్‌టైల్ పార్క్ సమస్యలు పరిష్కరించాలి

మడికొండ, జనవరి 6: మడికొండ శివారు టెక్స్‌టైల్ పార్కులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక టెక్స్‌టైల్ వ్యాపారులు శనివారం రాష్ట్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదారాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కొవిడ్ మహమ్మారి టెక్స్‌టైల్ మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేయడంతో బ్యాంక్ చార్జీలు, వడ్డీలు కూడా చెల్లించలేనేని పరిస్థితి నెలకొందన్నారు. బ్యాంక్ వడ్డీలు, చెల్లించడానికి చేతిలో చిల్లి గవ్వకూడా లేదని తెలిపారు ప్రభుత్వం సహకరించి ఫ్యాక్టరీలు సక్రమంగా నడిచి తమ జీవితాల్లో వెలుగులు నింపే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ మేరకు వినతి పత్రంలో పేర్కొని మంత్రిని కోరినట్లు మడికొండ టెక్స్‌టైల్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కూరపాటి విజ్‌కుమార్, దగ్గు రవిందర్‌రావు, మామిడి రాజు, మచ్చ వీరన్న, డాక్టర్ వెంకట్‌రాములు, రంగస్వామి, తిరుపతి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


బైక్‌ను ఢీకొన్న లారీ

ప్రైవేటు టీచర్ మృతి



హనుమకొండ టౌన్, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్ భీమారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు సునయన(25) మృతి చెందారు. భీమారం సమీపంలోని స్కిల్ స్ట్రోక్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేస్తున్న సునయన తోటి ఉపాధ్యాయుడు విశ్వచటర్జీతో కలిసి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళుతోంది. ఈ క్రమంలో భీమారం పెట్రోల్ బంక్ ముందు హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న సునయన లారీ వెనుక చక్రాల కింద పడిపోగా నడుపుతున్న విశ్వచటర్జీ పక్కకు పడిపోయాడు. లారీ చక్రాల కింద పడిపోయిన సునయన నడుము నుంచి కాళ్ల వరకు నుజ్జునుజ్జు అయ్యాయి. విశ్వ చటర్జీకి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారయ్యాడు.

సమాచారం అందుకున్న కేయూ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. తీవ్రగాయాలైన సునయనను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సునయన మృతి చెందింది. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కాగా ముంబయికి చెందిన సునయన రెండేళ్లుగా ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా చేస్తూ భీమారం సమీపంలోని బ్యాంక్ కాలనీలో అద్దెకు ఉంటోంది. సునయన మృతి పట్ల పాఠశాల చైర్మన్ తిరుమల్‌రావు, డైరెక్టర్ అనూప్ సంతాపం తెలిపారు.



లారీ చక్రాల కింద సునయన



ఇంతెజార్‌గంజ్ సీఐగా బాధ్యతల స్వీకరణ



మట్టెవాడ, జనవరి 6: వరంగల్ ఇంతెజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్. పవన్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఎల్.పవన్‌కుమార్ ఇటీవల సీఐగా పదోన్నతి పొంది ఆసిఫాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌గా, వరంగల్ కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేశారు. శనివారం ఇంతెజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ అబ్దుల్ బారి, వరంగల్ ఏసీపీ బోనాల కిషన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పవన్ కుమార్‌కు ఇంతెజార్‌గంజ్ ఎస్సైలు కొమురెల్లి, ప్రసన్నకుమార్, ఇతర పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

నెలాఖరుకు జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలి

(5వ పేజీ తరువాయి)

విశ్రాంతి షెడ్‌లు, తాగునీటి వసతులు, మరుగుదొడ్లు, క్యూలైన్లను పరిశీలించారు.

'బంగారం' సమర్పణకు కన్వేయర్ బెల్ట్

భక్తులు బంగారం(బెల్లం) సమర్పించుకొనేందుకు ఆధునిక పద్ధతిలో కన్వేయర్ బెల్ట్‌ను ప్రయోగాత్మకంగా ఈసారి ఉపయోగించనున్నారు. కలెక్టర్ త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్‌లకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, ఈవో రాజేంద్రం, టెక్నికల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ ప్రణాళికను మంత్రికి వివరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తులు సమర్పించే ముడుపులు, బెల్లం గద్దెలపైకి విసరకుండా నేరుగా తల్లులకు చేరేలా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. బెల్లం, ముడుపులు అపవిత్రం కాకుండా భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

పార్కింగ్ స్థలాల చదును పనులు ప్రారంభం

అభివృద్ధి పనులలో భాగంగా పార్కింగ్ స్థలాల చదును పనులను పంచాయతీరాజ్ అధికారులు శనివారం ప్రారంభించారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులు సమ్మక్క, సారలమ్మల మహా జాతర జరుగనున్న నేపథ్యంలో భక్తులు వాహనాలు నిలుపుకునేందుకు 30 ప్రాంతాల్లో 800ఎకరాలు రెవెన్యూ, 400 ఎకరాలు అటవీ భూమిని కలిపి మొత్తంగా 1200 ఎకరాలలో చదును పనులు ప్రారంభించారు. వనదేవతల దర్శనానికి కోటిన్నర మందికి పైగా భక్తులు వస్తారనే అంచనా ఉండగా లక్షల సంఖ్యలో వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రిని కలిసిన గోపా ప్రతినిధులు

పోచమ్మమైదాన్, జనవరి 6: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జిల్లా గోపా ప్రతినిధుల బృందం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. శనివారం మంత్రిని హుస్నాబాద్‌లోని క్యాంపు ఆవరణలో కలిసి ఈనెల 28న ఖిలవరంగల్‌లో నిర్వహించే బోయిగౌడ వన భోజన కార్యక్రమం హాజరుకావాలని కోరారు. జిల్లా గోపా అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ కాకతీయులు పాలించిన ఖిలవరంగల్‌లో వన భోజనాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొమ్మెర కుమారస్వామిగౌడ్, రాష్ట్ర నాయకులు కల్లెపు కిరణ్‌గౌడ్, తాబేటి వెంకన్నగౌడ్, లింగమూర్తి, పోషాల సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సంగెం, జనవరి 6:మృతుల కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. శనివారం మొండ్రాయి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అనుముల ప్రతాప్ తల్లి ఇటీవల మృతిచెందగా ఆయన మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మహరాజ్ తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బానోతు ధర్మానాయక్ తండ్రిమంగ్యనాయక్ మృతిచెందగా మృతదేహానికి నివాళులర్పించారు. కార్య క్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వేంకటేశ్వరావు, వైస్ ఎంపీపీ మల్లయ్య, సంగెం సొసైటీ చైర్మన్ కుమారస్వామి యాదవ్, మాజీ మండల రైతు బంధు అధ్యక్షుడు నరహరి, మొగిలి పాల్గొన్నారు.

ఆర్చీగేటు, బస్ షెల్టర్‌కు భూమిపూజ

గీసుగొండ, జనవరి 6: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిలోఆర్చీగేటు నిర్మాణానికి శనివారం సర్పంచ్ గోనె మల్లారెడ్డి, అల్లం మర్రెడ్డిలు భూమిపూజ నిర్వహించారు. అల్లం జోజిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బాలకిశోర్ రెడ్డి రూ.15లక్షలతో నిర్మిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. అలాగే గ్రామ కూడలి వద్ద రూ.4లక్షలతో నిర్మించే బస్‌స్టాప్ షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిట్లు చెప్పారు. బస్టాప్ నిర్మాణానికి డాక్టర్ అటల్‌కుమార్ ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దుగ్గంపూడి రాయపురెడ్డి, అర్చకులుసముద్రాల సుదర్శనాచార్యులు, ఉప సర్పంచ్ గాదం శ్రీలత, నాయకులు మర్రెడ్డి, కొమ్ము శ్రీకాంత్, మర్రి క్రాంతి, కందికొండ రాజ్‌కుమార్, గోనె కుమారస్వామి, మాదాసి రాంబాబు, చాపర్తి కనకయ్య పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి భూమిపూజ



భూమి పూజలో కమిటీ సభ్యులు, తదితరులు

కరీమాబాద్, జనవరి6: కరీమాబాద్ బొమ్మలగుడి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనకు శనివారం భూమి పూజ నిర్వహించారు. పురోహితులు పోలోజు భాస్కరాచారి, కాశీవిశ్వేశ్వరస్వామి (బొమ్మలగుడి) దేవాలయ అర్చకులు శివపురం రామలింగ ఆరాధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయి కమిటీ సభ్యులు మాట్లాడుతూ కరీమాబాద్ బొమ్మలగుడి బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఫిబ్రవరి 12, 13, 14 తేదీల్లో వైభవోపేతంగా నిర్వ హించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు



ధనుర్మాసోత్సవ పూజలో పాల్గొన్న భక్తులు

మట్టెవాడ, జనవరి 6: వరంగల్ బట్టల బజార్‌లోని బాలానగర శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం వేంకటేశ్వరస్వామి ఏకనామం 24 గంటలపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకనామాన్ని భక్తులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎలాపాటి రత్నాకర్‌రెడ్డి, పద్మావతి, లక్ష్మి, గుమ్మడవెల్లి అశోక్, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, అర్చకులు శ్రీధరాచార్యులు, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, సభ్యులు గందె గోవిందరాజులు, మాధవి, ఇందుమతి, సుధ, కన్య, మాధురి, అనిత, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, సూర్యం, అశోక్, సోమేశ్వర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

తిరుకల్యాణోత్సవం పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి



గోదాదేవి తిరుకళ్యాణోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్, జనవరి 6: ధనుర్మాసోత్సవం ముగింపులో భాగంగా ఈనెల 14న సంక్రాంతి రోజున శ్రీగోవిందరాజస్వామి దేవాలయం మెట్ల వద్ద జరిగే శ్రీగోదాదేవి తిరుకల్యాణోత్సవం పోస్టర్‌ను శనివారం మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. హనుమకొండలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణలోనే ప్రాశస్త్యమైన గోవిందరాజస్వామి దేవాలయం (గుట్ట)ను అన్ని వసతులతో ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతానని, ఇప్పటి వరకు ఏమైనా కబ్జాలు జరిగితే వాటిపై కూడా దేవాదాయశాఖ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. అర్చకుల సమస్యలను సానుభూతితో పరిష్కరించనున్నట్లు మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి, అర్చకులు, టీపీసీసీ నాయకుడు మీసాల ప్రకాష్, ఆలయ అర్చకులు సాయి మనోజు స్వామి, వేణుమాధవ్ స్వామి, కిరణ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

- వరంగల్ సిటీ : రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. శనివారం హనుమకొండలోని మంత్రి సురేఖ నివాసంలో క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మధులిమాయే, నాగరాజు, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.రాంబాబు, వి.రాంబాబు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి యాట సదయ్య, నాయకులు సుధాకర్‌రెడ్డి, సాంబయ్య, రమేష్, విద్యాసాగర్, తిరుపతయ్య, సదానందం, శ్రీలత, మనోహరి, పరమేశ్వర్, శివకోటి, సుమన్, రవీందర్‌రెడ్డి, మహేందర్, శేషాచారి, మహేందర్, కిషన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.
- ఖిలావరంగల్: న్యూఇయర్ క్యాలెండర్లను మంత్రి కొండా సురేఖమురళీధర్‌రావు ఆవిష్కరించారు. శనివారం హనుమకొండలోని రాంనగర్‌లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెడిద వీరన్న ఆధ్వర్యంలో సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ 37వ డివిజన్ అధ్యక్షుడు బోయిని దూడయ్య, మైనారిటీ నాయకుడు ఎమ్డీ పాయిమ్‌మోహిన్, నాయకులు బంగారు శ్రీనివాస్, సిరబోయిన కిరణ్, బోయిని రాజు, ప్రభాకర్, మాదాసి మధు, ఏసీరెడ్డి ప్రభాకర్, అచ్చ కార్తిక్, గద్దంరాజు, బొలుగోడ్డు రఘు, బొక్క నిరంజన్, జి.రాజేష్ పాల్గొన్నారు.



ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి

విశేష స్పందన

భూపాలపల్లిలో తరలొచ్చిన మహిళామణులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి)/భూపాలపల్లిటౌన్, జనవరి 6: 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' యేటా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ముగ్గుల పోటీ నిర్వహించింది. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు, యువతులు 154 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 8గంటలకే స్టేడియంకు చేరుకొని పేర్లు నమోదు చేసుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సంప్రదాయాలు ఉట్టిపడేలా, పల్లెటూరి వాతావరణాన్ని సంతరించుకునేలా గొబ్బెమ్మలు, పూలు, పండ్లు, పిండి వంటకాలతో వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముత్యాల ముగ్గుల పోటీలను తొలుత జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, భూపాలపల్లి పట్టణ సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై శ్రీలత, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నతోపాటు పలువురు అధికారులు ముగ్గులను చూసి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, నాయకులు ఇస్లావత్ దేవన్, క్యాతరాజు సాంబమూర్తి, పిప్పాల రాజేందర్, ఉడుత మహేందర్, రంజిత్, విజయ్ తదితరులు ముగ్గులను పరిశీలించారు. అనంతరం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు ఎ.రజిత, ఎం.లావణ్య ముగ్గులను పరిశీలించారు. 154 మంది వేసిన ముగ్గులను పరిశీలించి మార్కులను వేశారు.

విజేతలకు బహుమతుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బహుమతులను అందించారు. ప్రథమ బహుమతి భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన ఈర్ల లావణ్య కైవసం చేసుకోగా.. ఆమెకు రూ.6వేల నగదును అందించారు. అలాగే ద్వితీయ స్థానంలో పరకాలకు చెందిన బోయిని రమాదేవి నిలువగా ఆమెకు రూ.4వేల నగదును, తృతీయ స్థానంలో నిలిచిన పట్టణంలోని టీటూ క్వార్టర్స్‌కు చెందిన పూదరి శైలజకు రూ.3వేల నగదును ఎమ్మెల్యే గండ్ర, ప్రముఖ వైద్యులు కేఎస్ కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నల చేతుల మీదుగా అందించారు. వీరితోపాటు కన్సోలేషన్స్ బహుమతి కింద కృష్ణకాలనీకి చెందిన కె.రమణ, జవహర్‌నగర్ కాలనీకి చెందిన చల్ల రమణలకు మెమోంటోలను బహూకరించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న మహిళలకు ఎమ్మెల్యే గండ్ర చీరలను అందజేశారు. ముగ్గుల పోటీల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్న విషయం తెలుసుకొని ప్రతీ మహిళకు చీరలు బహుమతిగా ఇస్తానని ప్రకటించి అందించారు.

సీఎంను కలిసిన ప్రొఫెసర్ దయాకర్

గీసుగొండ, జనవరి 6: సీఎం రేవంత్‌రెడ్డిని ధర్మారంనకు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్ మర్యాదపూర్వంగా కలిశారు. శనివారం సచివాలయం లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నతవిద్యను, విశ్వవిద్యాలయాలను ప్రక్షాళన చేయాలని సీఎంకు విన్నవించినట్లు దయాకర్ పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా యూనివర్సిటీలలో వీసీల పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఉన్న తవిద్యను అభ్యసిస్తున్న అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యవిద్యను అందించేలా చూడాలని కోరినట్లు చెప్పారు.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్‌సిటీ, జనవరి 6: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రూపొందించిన క్యాలెండర్, డైరీని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.లింగారెడ్డి ఆవిష్కరించారు. శనివారం వరంగల్ డీఈవో కార్యాలయం ఆవరణలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎ.గోవిందరావు, కె.యాకయ్య, హనుమకొండ జిల్లా కార్యదర్శి టి.సుదర్శనం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎం.గంగాధర్, ఎం.బాలకుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ



20 డివిజన్‌లో అధికారులకు స్వీట్లు తినిపిస్తున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్



కరీమాబాద్‌లో వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ మరుపల్ల రవి

విజయవంతంగా 'ప్రజాపాలన' ముగియడంతో పలుచోట్ల స్వీట్ల పంపిణీ

శంభునిపేట, జనవరి 6 : ప్రభుత్వ సంక్షేమ పథకాల కొరకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరినీ లబ్ధిదారులుగా గుర్తించాలని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్ అన్నారు. రంగశాయిపేటలోని మహిళా స్వశక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ముగింపు సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి, బిల్ కలెక్టర్ సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

- సంగెం: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగెం ఎంపీపీ కళావతి కోరారు. శనివారం తీగరాజుపల్లిలో జరిగిన ప్రజాపాలన సభలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రమగోపాల్, ఎంపీటీసీ రంగరాజు నర్సింహస్వామి, ఎంపీవో కొమురయ్య పీఆర్ ఏఈ రమేష్, ఏపీఎం కిషన్ పాల్గొన్నారు. కాగా, మండల పరిషత్‌కార్యాలయంలో శిక్షణ పొందిన వారి చేత దరఖాస్తులను సంగెం ఎంపీడీవో రవీందర్ పర్యవేక్షణలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.
- కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఇంటి స్థలాలను కేటాయించాలని కోరుతూ వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి అన్నారు. శనివారం ఉర్సు సీఆర్‌సీ సెంటర్‌లో ప్రజాపాలన ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్‌కు ఉద్యమంలో జైలు జీవితం గడిపిన ఉద్యమకారులకు ఇంటి స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రాన్ని అందించారు.
- ఖిలావరంగల్: ఖిలావరంగల్ 37,38 డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు బోయిని దూడయ్య ఆధ్వర్యంలో ముంగిపు కార్యక్రమంనిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి బెడిద వీరన్న, మాజీ డివిజన్ అధ్యక్షుడు అల్లం కేశవరాజు, మత్స్య సొసైటీ అధ్యక్షుడు సంగరబోయిన చందర్, నాయకులు తోట ప్రభాకర్, సిరబోయిన గిరి, మేకల క్రిష్ణ, బంగారు శ్రీనివాస్, దయాకర్ పాల్గొన్నారు.

నగరంలో స్వీట్ల పంపిణీ

ఖిలావరంగల్: అభయహస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ ప్రజాపాలన విజయవంతం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు శామంతుల శ్రీనివాస్ స్వీట్లను పంపిణీ చేశారు. శనివారం 34వ, డివిజన్ భూపేష్‌నగర్‌లోని కమ్యూనిటీ భవనంలో ఉద్యోగులకు స్వీట్లను పంపిణీ చేశారు. క్రిస్టియన్‌కాలనీలో అంబేద్కర్‌భవన్‌లో సీనియర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు జన్ను వివేక్ ఆధ్వర్యంలో అధికారులు, దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడిపెల్లి ఫ్రాన్సిస్ జాషువా, ఈసంపెల్లి ప్రభాకర్, అయిత సురేష్, గబ్బిట సుధాకర్ పాల్గొన్నారు.

- వరంగల్‌టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల పాలనని 20వ డివిజన్ కార్పొరేటర్ జినరేంద్రకుమార్ అన్నారు. శనివారం ప్రజాపాలన అభయహస్తం ఆరు పథకాల దరఖాస్తు ఫారాల స్వీకరణకు చివరి రోజును పురస్కరించుకుని బీఎస్‌రావు కమ్యూనిటీహాలులో అధికారులకు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిలువేరు శ్రీనివాస్, ఫయాజ్, వేణు, కూరాకుల చంద్రశేఖర్, దేవునూరి రవి, చిరంజీవి, గొర్రె ప్రశాంత్, నటరాజ్ పాల్గొన్నారు. ఏనుమాముల బాలాజీనగర్ వాటర్ ట్యాంక్ వద్ద నిర్వహించిన ప్రజాపాలన చివరి రోజును పురస్కరించుకుని టీ పీసీసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అడుప మహేష్ సెంటర్‌ను సందర్శించి అధికారులను దరఖాస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మొండ్రాయిని మండలంగా గుర్తించాలి

సంగెం: మొండ్రాయిగ్రామాన్ని మండలంగా గుర్తించాలని కోరుతూ ప్రజా ప్రతినిధులు అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. శనివారం మొండ్రాయిలో ప్రజాపాలన గ్రామ సభ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సంగెం తహసీల్దార్ రాజకుమార్‌కు సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ గూడ కుమారస్వామి, ఎంపీటీసీ కొనకటి రాణిమొగిలిలు వినతిపత్రం అందించారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పేద ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు పెండ్లి పురుషోత్తంరెడ్డి, కక్కెర్ల వీరస్వామి, మడత కేశవులు, పెండ్లిరాములు, యాకయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 7 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

నల్లబెల్లి, జనవరి 6 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్‌ను ఎంపీడీవో విజయ్‌కుమార్ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. పీఆర్టీయూ ఉపాధ్యాయులు విద్యార్థుల మేధోశక్తిని పెంచే విధంగా బోధన చేయాలన్నారు.కార్యక్రమంలో ఎంపీవో కూచన ప్రకాష్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు నకిరెడ్డి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పోలోజు భిక్షపతి, గౌని చంద్రశేకర్, కందగట్ల నాగరాజు, శనిగరం శ్రీనివాస్, బాలోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఆర్పీఐ నాయకులు



మంత్రి సీతక్కకు బొకె అందజేస్తున్న నర్సంపేట ఆర్పీఐ నాయకులు

నర్సంపేట, జనవరి 6 : రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ములుగులోని క్యాంప్ కార్యాలయంలో శనివారం నర్సంపేటకు చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క భిక్షపతి, నాయకులు జమ్మాల నాగరాజు, యూత్ నాయకులు రంజిత్, గణేశ్, నరేశ్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

• వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, జనవరి 6 : పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలపై ఎలాంటి భయాందోళనలు పెట్టుకోకుండా స్వేచ్ఛగా పరీక్షలు రాయాలని, అలాంటప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. పదవ తరగతి పరీక్షల్లో సాధించిన ఫలితాల మీదే పైచదువులు ఆధారపడి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మహేంద్ర, నాయకులు అనిల్‌రావు, దేవేందర్‌రావు, శ్రీనివాస్‌నాయక్, సునిల్ రావు, సురేందర్‌రావు, రాంచందర్, పూర్ణచందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదవతరగతిలో ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించితే వారి భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అవుతుందని మండలంలోని సూరుపల్లి గ్రామ సర్పంచ్ సింగారపు గీతాభాస్కర్ అన్నారు. శనివారం పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాసర లాంటి ఐఐటీ విద్యా సంస్థలో సీటు సాధించుటకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన వారికే మొదటి ప్రాధాన్యతన ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలకు సెల్‌ఫోన్‌లు అందుబాటులో ఉంచకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాదాసు శారదశ్రీనివాస్, హెడ్మాస్టర్ బత్తుల పరమేశ్వర్, పీఈటీ కోట రాంబాబు, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాస్, జోగయ్య, రమేశ్, నర్సింహారావు, వెంకటలక్ష్మి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

గోమాత గొప్పతనాన్ని గుర్తించాలి

• ఏసీపీ తిరుమల్



గోవు పేడతో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్

నర్సంపేట, జనవరి 6 : గోమాత గొప్పతనాన్ని విద్యార్థులు, ప్రతీ ఒక్కరు గుర్తించాలని నర్సంపేట ఏసీపీ తిరుమల్ అన్నారు. పట్టణంలోని డఫోడిల్ పాఠశాలలో ఆవు పేడతో తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోవు పేడతో తయారు చేసిన వస్తువుల ఎగ్జిబిషన్‌ను తాను మొదటి సారిగా చూస్తున్నానని అయన సంతోషం వ్యక్తం చేశారు. గోవు నుంచి లభించే పాలు, పెరుగు, నెయ్యిలో పోషక విలువలు, ఔషధగుణాలు ఉన్నాయన్నారు. గోమాత గురించి వేమన రాసిన పద్యాన్ని విద్యార్థులకు గుర్తుచేశారు. ఆవుపేడతో వస్తువులను తయారు చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. పాఠశాల ఛైర్మన్ చింతల నరేందర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఆక్సిజన్ తీసుకొని ఆక్సిజన్‌ను వదిలే ఒకే ఒక్క జీవి గోమాతని పేర్కొన్నారు. ఆవు పేడతో విద్యార్థులు తయారు చేసిన వస్తువులను విద్యార్థుల తల్లిదండ్రులు కొనుగోలు చేశారు. వస్తువుల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులను అనాథా శ్రమం, వృద్ధాశ్రమాలకు విరాళంగా అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో నర్సంపేట సీఐ రవికుమార్, నెక్కొండ సీఐ హతిరాం, దుగ్గొండి సీఐ కిషన్ నర్సంపేట ఎస్సై ఎస్.రవి, ఖానాపురం ఎస్సై మాధవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తి అవార్డు అందుకున్న కానిస్టేబుల్ రాజు



అవార్డు అందుకుంటున్న రాజు

ఖానాపురం, జనవరి 6 : మండలంలోని రాగంపేటకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు సేవాస్ఫూర్తి-2024 అవార్డును అందుకున్నట్లు శనివారం తెలిపాడు. హైదరాబాద్‌కు చెందిన వియస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ 11వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో అవార్డు అందుకున్నాడు. వరంగల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సీటీ ఆర్మ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు 2005సంవత్సరం నుంచి బ్లడ్ డోనర్, బ్లడ్ మోటివేటర్, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, అవయవదానం, ప్లాస్మాదానం, నేత్రదానం, గ్రామీణప్రాంత విద్య అభివృద్ధికోసం కృషిచేయడం, స్వచ్ఛభారత్, హరితహారం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను రాజు సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపికచేసినట్లు రాజు తెలిపాడు. ఈ కార్యక్రమంలో వియస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ నవీన్, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పర్వతగిరి, జనవరి 6 : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని నారా యణపురం గ్రామంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బాల్నె భాస్కర్ తన కులవృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ మోకుజారి కిందకు జారిపడడంతో తలకు గాయాలై కాలు విరిగింది. గమనించిన చుట్టు పక్కల వారు వెంటనే చికిత్స నిమిత్తం ఆయనను ఆస్పత్రికి తరలించారు. పేద కుటుంబానికి చెందిన భాస్కర్‌కు చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు.

వంతెన నిర్మాణం కలేనా..?

• పాకాల (మున్నేరు) వాగుపై శిలాఫలకం వేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

• నెలలు గడిచినా ప్రారంభంకాని పనులు

• వంతెన నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న గ్రామస్థులు, రైతులు



చెన్నారావుపేటలోని పాకాల వాగు (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 6 : మండల కేంద్రంలో పాకాల (మున్నేరు) వాగుపై వంతెన నిర్మాణం మండలప్రజలకు కలగానే మిగిలింది. చెన్నారావుపేట మండలంతోపాటు ఖానాపురం మండలాన్ని కలుపుతూ రంగాపురం- చెన్నారావుపేట గ్రామాల మధ్య నిర్మించాల్సిన వంతెన నిర్మాణ పనులు మాత్రం ప్రారంభించక పోవడంపట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉండి వరంగల్ ఎంపీగా పోటీ చేసి, గెలిచిన రామసాయం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంలో పని చేసిన పొన్నాల లక్ష్మయ్య, పురుషోత్తం, బస్వరాజు సారయ్యలతో పాటు పలువురు మంత్రులు వాగు వద్దకు వచ్చి వాగ్దానాలు చేశారని గ్రామస్థులు తెలుపుతున్నారు. అంతే కాకుండా నర్సంపేట నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచిన రేవూరి ప్రకాష్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సైతం రైతులకు, గీత కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా వాగుపై వంతెన నిర్మాణంను చేపడతామని గత ఎన్నికల సమయంలో హామీలను ఇచ్చారని గ్రామస్థులు వాపోవుతున్నారు అలాగే 2023లో తాజా మాజీ ఎమ్మె ల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వంతెనతో పాటు చెక్ డ్యామ్ నిర్మాణం కోసం రూ.18 కోట్ల 78లక్షను మంజూరుచేశారు. ఎంతో అట్టహాసంగా వాగుపై వంతెన నిర్మాణ పనులతో పాటు చెక్‌డ్యామ్ నిర్మాణ పనుల కోసం శిలాఫలకం వేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. పనుల ప్రారంభంకోసం శిలాఫలకంవేసి నెలలు గడుస్తున్నా వంతెన నిర్మాణ పనులు ప్రారంభంకాలేదు. వాగులో వర్ష కాలంలో రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతు న్న విషయాన్ని ప్రతిసారి ఎన్నికల సమయం ముందు, వంతెన నిర్మాణం పనులను చేపడుతామని చెప్పే నాయకులు ఇప్పటికైనా నిర్మాణ ప నులను ప్రారంభించాలని పలువురు గుర్తు చేస్తున్నారు. ఇటీవల గెలిచిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి రైతుల, గీత కార్మికుల వంతెన దాటే కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

• హామీలకే పరిమితమైన వంతెన నిర్మాణం

నాంపెల్లి సంపత్, పాతమగ్దుంపురం



పాకాల వాగుపై వంతె న నిర్మాణం ఎన్నికల హా మీలకే పరిమితమవుతోం ది. గత 40సంవత్సరాలు గా రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇస్తూ గెలిస్తున్నారు తప్పా, సమస్య సమస్యగానే ఉంటుంది. గ్రామంలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నిధులు మంజూరయ్యాయని శిలాఫలకం వేశారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభించటం లేదు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని నాయకులను ఎన్నుకుంటే మళ్లి ఎన్నికల సమయం వరకు సమస్య అలాగే ఉంటుంది.

• 40 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం

బాదవత్ చందర్, అక్కల్‌చెడ



పాకాల వాగుపై వంతెన నిర్మాణం లేకపోవటంతో వర్ష కాలంలో వాగు దాటడానికి 40 ఏళ్లగా ఇబ్బంద లు పడుతన్నాం. ఈ వేసవి కాలంలో వాగుపై చెక్ డ్యామ్, వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తే బాగుంటుంది. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నాయకులు తిరిగి వంతెన నిర్మాణ మాటను ప్రస్తవించక పోవటం చాలా బాధాకరం. అధికారులు, పాలకులు నిర్లక్ష్యంతో వాగులో ఎంతో మంది ప్రాణాలను వదిలారు. ఈ సారి ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే మాధవరెడ్డి వాగుపై వంతెన, చెక్ డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తే బాగుంటుంది.

ముగిసిన 'ప్రజా పాలన' సభలు



దమ్మన్నపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్ సాగర్

చెన్నారావుపేట, జనవరి 6 : మండలంలో తిమ్మారాయిన్‌పహాడ్, ఎల్లాయిగూడెం, మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు శనివారం ముగిశాయి. తహసీల్దార్ ఫణి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వంఅందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి,ఎంపీవో శ్రీధర్‌రాజు, ఏఈ మంగీలాల్, సూపర్ వైజర్ మంజుల సర్పంచ్‌లు కుండె మల్లయ్య, కొండవీటి పావని ప్రదీప్ కుమార్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

• ప్రచారం చేసిన కళాకారులు

మండల కేంద్రంలో ప్రజా పాలన గ్రామ సభ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సంస్కృతిక సారధి నెల్లుట్ల సుమన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలపై శనివారం విస్తృత ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట పాటలతో ప్రజలను చైతన్య పరుచ డం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుండె మల్లయ్య తహశీల్దార్ ఫణికుమార్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, కళాబృందం తాళ్ల సునిల్, పడిదం రాజేందర్, గాదేపాక బాబు, బరిగెల రవిందర్, యోచన పాల్గొన్నారు.

• ప్రజలు అధికారులకు సహకరించాలి

వర్ధన్నపేట రూరల్ : ప్రజాపాలన కార్యక్రమంలో అభయహస్తం కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రతీ ఒ క్కరు అధికారులకు సహకరించాలని వర్ధన్నపేట తహ సీల్దార్ విజయ్‌సాగర్ కోరారు. శనివారం మండలంలోని దమ్మన్నపేటలో నిర్వహించిన గ్రామ సభలో పా ల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభు త్వం చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాలకు దరఖాసు కున్న వారిలో అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకం అందే లా చూస్తామన్నారు. ప్రజలు అపోహలకుగురై ఇబ్బందులు పడొద్దన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో తదుపతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. దరఖాస్తుచేసుకున్న ప్రతి వ్యక్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమక్క తదితరులు పాల్గొన్నారు.

• అధికారులు పారదర్శకత పాటించాలి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో అధికారులు పారదర్శకతను పాటించి అర్హులకు సంక్షేమ పథకాలను అందించాలని నెక్కొండ మేజర్ గ్రామ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నెక్కొండ, పెద్దకొర్పోలులో శనివారం ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నాడని ఈ విషయంలో అధికారులు వారి విధులను బాధ్యతతో నిర్వహించి ప్రభుత్వానికి సహ కారం అందించాలని సూచించారు.

సంక్షేమ పథకాల ద్వార లబ్ధిపొందుటకు అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని సర్పంచ్ కోరారు.కార్యక్రమంలో టీంలీడర్లు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏపీఎం శ్రీనివా స్, పెద్ద కొర్పోలు సర్పంచ్ మైబుబ్ పాషా, విద్యుత్ ఏఈ చిరంజీవి, కార్యదర్శి సదానందం, ఉపసర్పంచ్ వీరభద్రం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరుకు జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలి

(5వ పేజీ తరువాయి)

విశ్రాంతి షెడ్‌లు, తాగునీటి వసతులు, మరుగుదొడ్లు, క్యూలైన్లను పరిశీలించారు.

• 'బంగారం' సమర్పణకు కన్వేయర్ బెల్ట్

భక్తులు బంగారం(బెల్లం) సమర్పించుకొనేందుకు ఆధునిక పద్ధతిలో కన్వేయర్ బెల్ట్‌ను ప్రయోగాత్మకంగా ఈసారి ఉపయోగించనున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్‌లకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, ఈవో రాజేంద్రం, టెక్నికల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ ప్రణాళికను మంత్రికి వివరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తులు సమర్పించే ముడుపులు, బెల్లం గద్దెలపైకి విసరకుండా నేరుగా తల్లులకు చేరేలా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. బెల్లం, ముడుపులు అపవిత్రం కాకుండా భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

• పార్కింగ్ స్థలాల చదును పనులు ప్రారంభం

అభివృద్ధి పనులలో భాగంగా పార్కింగ్ స్థలాల చదును పనులను పంచాయతీరాజ్ అధికారులు శనివారం ప్రారంభించారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులు సమ్మక్క, సారలమ్మల మహా జాతర జరుగనున్న నేపథ్యంలో భక్తులు వాహనాలు నిలుపుకునేందుకు 30 ప్రాంతాల్లో 800 ఎకరాలు రెవెన్యూ, 400 ఎకరాలు అటవీ భూమిని కలిపి మొత్తంగా 1200 ఎకరాలలో చదును పనులు ప్రారంభించారు. వనదేవతల దర్శనానికి కోటిన్నర మందికి పైగా భక్తులు వస్తారనే అంచనా ఉండగా లక్షల సంఖ్యలో వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

• రైతుల ఆందోళన

గత జాతరలో పార్కింగ్ చదును పనులు పంట నష్టపోతున్న రైతులకు అప్పగించారని, ఈసారి రైతులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్‌లకు ఇవ్వడంతో పంట నష్టపోతున్నామని రైతులు ఎనగంటి భద్రయ్య, సిద్ద బోయిన శివరాజు, గందం జనార్దన్, సంకె శ్రీనివాస్, రాజు, బాలయ్య, రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలను పార్కింగ్ స్థలాల పేరుతో గుంతలు చేస్తున్నారని అన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని, ఆదేవిధంగా గుంతలను వారిచే పూడ్చించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వాహనాలు పార్కింగ్ చేయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన

• భూపాలపల్లిలో తరలొచ్చిన మహిళామణులు



ప్రథమ విజేతకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ(భూపాలపల్లి)/భూపాలపల్లిటౌన్, జనవరి 6: 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' యేటా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ముగ్గుల పోటీ నిర్వహించింది. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు యువతులు 154 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకే స్టేడియంకు చేరుకొని పేర్లు నమోదు చేసుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సంప్రదాయాలు ఉట్టిపడేలా, పల్లెటూరి వాతావరణాన్ని సంతరించుకునేలా గొబ్బెమ్మలు, పూలు, పండ్లు, పిండి వంటకాలతో వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముత్యాల ముగ్గుల పోటీలను తొలుత జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, భూపాలపల్లి పట్టణ సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై శ్రీలత, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నతో పాటు పలువురు అధికారులు ముగ్గులను చూసి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, నాయకులు ఇస్లావత్ దేవన్, క్యాతరాజు సాంబమూర్తి, పిప్పాల రాజేందర్, ఉడుత మహేందర్, రంజిత్, విజయ్ తదితరులు ముగ్గులను పరిశీలించారు. అనంతరం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు ఎ.రజిత, ఎం.లావణ్య ముగ్గులను పరిశీలించారు. 154 మంది వేసిన ముగ్గులను పరిశీలించి మార్కులను వేశారు.

• విజేతలకు బహుమతుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బహుమతులను అందించారు. ప్రథమ బహుమతి భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన ఈర్ల లావణ్య కైవసం చేసుకోగా.. ఆమెకు రూ.6వేల నగదును అందించారు. అలాగే ద్వితీయ స్థానంలో పరకాలకు చెందిన బోయిని రమాదేవి నిలువగా ఆమెకు రూ.4వేల నగదును, తృతీయ స్థానంలో నిలిచిన పట్టణంలోని టీటూ క్వార్టర్స్‌కు చెందిన పూదరి శైలజకు రూ.3వేల నగదును ఎమ్మెల్యే గండ్ర, ప్రముఖ వైద్యులు కేవీస్ కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నల చేతుల మీదుగా అందించారు. వీరితో పాటు కన్సలేషన్స్ బహుమతి కింద కృష్ణకాలనీకి చెందిన కె.రమణ, జవహర్‌నగర్ కాలనీకి చెందిన చల్ల రమణలకు మెమొంటోలను బహూకరించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న మహిళలకు ఎమ్మెల్యే గండ్ర చీరలను అందజేశారు. ముగ్గుల పోటీల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్న విషయం తెలుసుకొని ప్రతీ మహిళకు చీరలు బహుమతిగా ఇస్తానని ప్రకటించి అందించారు.

మద్ది మేడారం ఏర్పాట్లపై పరిశీలన



మద్ది మేడారంను పరిశీలిస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

నల్లబెల్లి, జనవరి 6 : మండలంలోని నాగరాజుపల్లి శివా రులోని మద్ది మేడారం జాతర ఏర్పాట్లపై శనివారం మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పరిశీలన చేశారు. అనంతరం జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి, రహదారి సదుపాయాలతో పాటు, సమగ్ర సదుపాయాలను కల్పించాలని అధికారులు, కాంగ్రెస్ నాయకులు మద్ది మేడారాన్ని పరిశీలించి తీవ్రంగా చర్చించుకున్నారు. అనంతరం అధికా రుల, నాయకుల సమన్వయంతో మద్ది మేడారంలో సమగ్ర సదుపాయాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ బొనగాని రాజేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎస్సై నాగేష్, కాంగ్రెస్ నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, మాలో తు రమేష్, వైనాల అశోక్, ఇస్తారు శేకర్, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల వితరణ



అయోధ్య అక్షింతలను ఇంటింటికి అందించిన సర్పంచ్, భక్తులు

నెక్కొండ, జనవరి 6: శ్రీఅయోధ్య రామనంద తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాముని అక్షింతలను అంగరంగ వైభవంగా శోభాయాత్రను నెక్కొండ మండలం అలంకానిపేటలో శనివారం నిర్వహించారు. అక్షింతలను గ్రామ సర్పంచ్ మాదా సు అనంతలక్ష్మిరవి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కర్పూరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి శోభాయాత్రను ప్రారంభించిన భక్తులు పూరవీధుల గుండా తిప్పగా అక్షింతలకు భక్తులు మంగళహారతిలతో స్వాగతం పలికారు.

శోభాయాత్ర ముగిసిన అనంతరం ఇంటింటికి కరపత్రాలు, ఫొటోలను, అక్షిం తలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామాలయ అర్చకులు శ్రీనివాస్‌శర్మ, ఉప సర్పంచ్ గుంటుక నర్సయ్య, వార్డు సభ్యులు, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

• రాయపర్తి : మండలంలోని పెర్కవేడులో శనివారం అయోధ్య శ్రీరాముల వారి అక్షింతలను సర్పంచ్ చిన్నాల తారాశ్రీ రాజబాబు వితరణ చేశారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి ర్యాలీగా వెళ్లి అక్షింతలను అందించారు. ఈ కార్య క్రమంలో శ్రీరామ జన్మభూమి ట్రస్టు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషి

పర్వతగిరి, జనవరి 6 : గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఇన్‌ఫర్ సంస్థ కృషిచేస్తుందని ఇన్‌ఫర్ సంస్థ డైరెక్టర్లు వి.వి.సాయిరెడ్డి, కిరణ్ అడ్డాల అన్నారు. శనివారం మండలంలోని రోళ్లకల్లు గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో ఇన్‌ఫర్ సంస్థ అందించిన నిధులతో నూతన స్టేజీ, టాయిలెట్ బ్లాక్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాషబోయిన రాములు, కరస్పాండెంట్ ఆర్.అశోకాచారి, కల్లెడ ఏహెచ్ఎం మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంబయ్యకు మార్నేని పరామర్శ

వర్ధన్నపేట రూరల్, జనవరి 6: మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వ్యక్తిగత సహాయకుడు బేతి సాంబయ్య తల్లి బేతి సుశీల అనారోగ్యంతో మృతిచెందగా శనివారం సాంబయ్యను వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె పార్థివ దేహనికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, నాయకుడు అంబటి ఎల్లస్వామిలు ఉన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

నెక్కొండ, జనవరి 6 : నెక్కొండ మండలం సూరుపల్లికి చెందిన గీత కార్మికుడు కొతకొండ రాజు ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలకు గురికాగా, ఆయనను వరంగల్ జిల్లా సర్వాయి పాపన్న మోకుదెబ్బ వరంగ ల్ జిల్లా అధ్యక్షుడు కక్కెర్ల నాగయ్య శనివారం పరామర్శించాడు. ఈ ప్రమాదంలో రాజు కాళ్లు, చేతులు విరగడంతో పాటు తీవ్రగాయాలు తగిలాయి. రాజు కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి సహాయం అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నెక్కొండ మండల సంఘం అధ్యక్షుడు మాదాటి శ్రీనివాస్, బురగాని కొమురయ్య, బత్తిని స్వామి, గడ్డం సంతోష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా చెత్త సేకరణ

• పర్యవేక్షించని అధికారులు

• తడి, పొడి చెత్తపై అవగాహన కరువు

వర్ధన్నపేట, జనవరి 6 : వర్ధన్నపేట మునిసిపాలిటీ పరి.దిలో చెత్త సేకరణ ఇష్టారాజ్యంగా జరుగుతోంది. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాల్సి ఉండగా మునిసిపల్ సిబ్బంది మాత్రం అంతా గంపగుత్తగా చెత్తనుసేకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి వాటినుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయడం ప్రభుత్వ లక్ష్యం. కానీ, పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. అలాగే పలు వార్డులలో రోడ్డు పక్కన వ్యర్థాలను, చెత్తను సిబ్బంది తొలగించకపోవడంతో పేరుకుపోతున్నాయి.

• తడి, పొడి చెత్తకు డబ్బాలు...

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో గతంలో ఇంటింటికి తడి, పొడి చెత్త సేకరణ కోసం డబ్బాలను పంపిణీ చేశారు. గత కొన్ని నెలల నుంచి తడి, పొడి చెత్త సేకరణ లేకుండా పోయింది. మొదట్లో తడి, పొడి చెత్తను ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల్లో సైతం చెత్త సేకరణ చేసేవారు. ప్రస్తుతం గంపగుత్తగా చెత్తను సేకరిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన శానిటేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు సైతం వినవస్తున్నాయి.